# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-11-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు కృషి చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

2. **తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పార్టీపరంగా కల్పించి.. పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.**

3. **ఆంధ్రప్రదేశ్ లోని గిరిజన ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు.**

4. **తెలంగాణలో పార్టీలు మారిన శాసనసభ్యుల అనర్హత పిటిషన్లపై రాష్ట్ర శాసనసభాపతి నిర్ణయం తీసుకుకోవాలని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు.**

5. **ఒడిశాలో జరిగిన నాలుగో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ జాతీయ క్రీడా మహోత్సవంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన విద్యార్థులు 118 పతకాలను సాధించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బోధనాసుపత్రులతో పాటు జిల్లా, సామాజిక, ప్రాంతీయ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు కృషి చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆసుపత్రుల పనితీరుపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజూ విధుల నిర్వహణలో భాగంగా వైద్యులు ఎంతమంది రోగులను ఓపీలో చూస్తున్నారో గమనించి నివేదికలు అందచేయాలన్నారు. ఉత్తమ వైద్య సేవలు అందించే వైద్యులు, సిబ్బందిని గుర్తించి ప్రోత్సహించాలని, విధుల్లో అలక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు ఉండాలని ఆదేశించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరిగే క్యాన్సర్ చికిత్స వివరాలను నమోదు చేసేలా ప్రణాళికలు రూపొందిచాలని మంత్రి సూచించారు.

--------------------------

తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పార్టీపరంగా కల్పించి.. పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం నిన్న సమావేశమైంది. సమావేశ నిర్ణయాలను తెలంగాణ సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాత్రికేయులకు వెల్లడించారు. పంచాయతీలకు వచ్చే ఏడాది మార్చి

ఆఖరులోగా ఎన్నికలు నిర్వహించకపోతే.. 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోతాయని తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై కోర్టు తీర్పులు వచ్చిన తర్వాతే... ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 30 సెకను

---

తయారీ రంగ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి  కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.  భారత పరిశ్రమల సమాఖ్య –సిఐఐ  ద్వారా కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ  సహకారంతో ఢిల్లీలో నిర్వహించిన 22వ సీఐఐ గ్లోబల్ ఎంఎస్ఎంఈ వాణిజ్య సదస్సులో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారు మార్కెట్లలో భారత్ ఒకటని  పేర్కొన్నారు.అలాగే అంతర్జాతీయ అనుసరణీయ ప్రమాణాలపై ఎంఎస్ఎంఈపరిశ్రమలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ప్రపంచ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి ప్రమాణాలను సమన్వయం చేయడం వలన దేశ ఎగుమతుల్లో  పోటీతత్వం పెరుగుతుందని మంత్రి వివరించారు.

---

ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి  సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గంలో శిఖపరువు జలపాతాన్ని పర్యాటకుల కోసం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డితో కలిసి మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ  గిరిజనుల భాగస్వామ్యంతో  జలపాతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.  ఇక్కడికి వచ్చే పర్యాటకుల కోసం ప్రాథమిక సౌకర్యాలన్నీ అందుబాటులోకి తెచ్చామని మంత్రి తెలియజేస్తూ

వాయిస్ .. 30 సెకన్లు

---

మాదక ద్రవ్యాల నిరోధంపై యువతకు అవగాహన కల్పించేందుకు 'సంకల్పం' పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ మేరకు అమరావతిలోని ఒక ప్రైవేటు విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు  ఈరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. నిన్న గుంటూరులో పాత్రికేయులతో మాట్లాడుతూ, మత్తు పదార్థాలను విక్రయిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను  అరెస్టు చేశామన్నారు వారి నుంచి   17 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

---

విశాఖపట్నం భాగస్వామ్య సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ లో పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం కానుందని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమి రెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. నెల్లూరులో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ సదస్సు ద్వారా నెల్లూరుజిల్లాకు 6 వేల కోట్ల రూపాయలతో పరిశ్రమలు  రానున్నాయని తెలిపారు.

వాయిస్..30 సెకన్లు

-------------------------

తెలంగాణలో పార్టీలు మారిన శాసనసభ్యుల అనర్హత పిటిషన్లపై రాష్ట్ర శాసనసభాపతి నిర్ణయం తీసుకుకోవాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో ఆయన నిన్న పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో శాసన సభ్యులు ఏ పార్టీలో గెలిచినా అధికారం ఉన్న పార్టీలో చేరే సంప్రదాయం కొన్ని ఏళ్లుగా కొనసాగుతోందన్నారు. అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టు 4 వారాల గడువు ఇచ్చిన నేపథ్యంలో కోర్టు ధిక్కరణ పరిస్థితి రాకుండా ఇప్పటికైనా స్పీకర్ కఠిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. రాజకీయ ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా చట్ట ప్రకారం నిర్ణయం తీసుకోవాలని మంత్రి సూచించారు.

-------------------------

ఒడిశాలోని రవూర్కెలాలో జరిగిన నాలుగవ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్–ఈఎంఆర్ఎస్ జాతీయ క్రీడా మహోత్సవంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన విద్యార్థులు పతకాలను సాధించారు. 36 బంగారు, 42 వెండి, 40 కాంస్య పతకాలు కలిపి మొత్తం 118 పతకాలు సాధించి ప్రతిభ కనబరిచారు. ఖోఖో అండర్–19 విభాగంలో బంగారు పతకం, వాలీబాల్ ఆటలో బాలురు, బాలికలు వేర్వేరుగా వెండి పతకాలు సొంతం చేసుకున్నారు. ఈ నెల 11 నుంచి 15 వరకు జరిగిన ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా ఉన్న ఈఎంఆర్ఎస్ పాఠశాలల నుంచి గిరిజన విద్యార్థులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 210 మంది బాలికలు, 218 మంది బాలురు మొత్తం 20 క్రీడా విభాగాల్లో పాల్గొన్నారు.

-------------------------

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ,

వాయిస్..25 సెకన్లు

ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్రంలోనూ చలి తీవ్రత కొనసాగుతోంది. పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్నాయి.

====================